

కరుణించని వరుణుడు

రైతులకు తిప్పలు

ప్రజాశక్తి-వేపాడ

నీరు తోడుతున్న ఇంజిన్

వరుణుడు కరుణించక పోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆగస్టు రెండో వారం పూర్తయినా వరినాట్లు పడ లేదు. ప్రతిరోజూ ఆకాశం మేఘావృతమై వర్షం పడేలా హడావుడి కనిపించడమే తప్ప చినుకు రాలడం లేదు. దీంతో బావులు, గుంతల్లో చేరిన వర్షపు నీటిని రైతులు ఆయిల్ ఇంజిన్లతో తోడుకొని నాట్లు వేసుకోవాల్సి వస్తోంది.

పేదలందరికీ ఇళ్లు పథకం

భూముల లెక్క తేలాల్సిందే

రెవెన్యూ రికార్డుల భద్రతకు చర్యలు
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి-విజయనగరం కోట

పేదలందరికీ ఇళ్ల పథకం కింద కేటాయించిన భూముల వివరాలను నిర్దేశిత ప్రోఫార్మాలో సమర్పించాలని రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా తహశీల్దార్లకు ఆదేశించారు. ఈ పథకం కింద మొత్తం ఎంత భూమి కేటాయించారు, అందులో ఎంత ప్రభుత్వ భూమి, ఎంత డి-పట్టా భూమి, ఎంత భూమిని కొనుగోలు చేసారు, ఎంత డబ్బు పరిహారంగా చెల్లించారు, ఇళ్ళ కోసం కేటాయించగా ఎంత భూమి మిగిలింది, లబ్ధిదారుల అర్హత వివరాలతో సహా నిర్దేశిత ప్రోఫార్మాలో రెవెన్యూ సదస్సుల లోపల సమర్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌పి సిసోడియా రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. గత 5ఏళ్లలో 22ఎ కింద నోటిఫై చేసిన భూముల వివరాలను, వెబ్‌ల్యాండ్, మ్యుటేషన్ సేవల రిపోర్ట్ లను మండలాల వారీగా పరిశీలించారు. రీ సర్వే అంశాలపై తహశీల్దార్లతో చర్చించారు. 20 ఏళ్ల క్రితం వరకు ఫ్రీ హోల్డ్ లో ఉన్న భూములను వెరిఫికేషన్ చేయవలసి ఉంటుందని అన్నారు. జిల్లాలో అసైన్డ్ భూముల వివరాలను, రైతుల కోసం, ఇళ్ల కోసం కేటాయించిన వాటి వివరాలను వేర్వేరుగా తహశీల్దార్లు నివేదికలు ఇవ్వాలని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులలో ఉన్న వివరాలు తహశీల్దార్ రికార్డులలో ఉన్న వివరాలు ఒకటే ఉండాలని అన్నారు.

జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డులకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాల నుంచి రక్షణ కల్పించే విధంగా పటిష్టమైన భద్రత వ్యవస్థను ఏర్పరిచేందుకు తహశీల్దార్ కార్యాలయాల్లో సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో కార్యాలయాల వద్ద వాచ్ మెన్‌లను నియమించా లని తెలిపారు.. రెవెన్యూ కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జెసి సేతు మాధవన్, డిఆర్ఒ అనిత, ఆర్‌డిఒలు సూర్య కళ, శాంతి, సాయిశ్రీ, జిల్లా రిజిస్ట్రార్ ఎవి కుమారి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పలు మండలాల్లో పర్యటన

భోగాపురం/వేపాడ : ఆర్.పి.సిసోడియా భోగాపురం, ఎస్.కోట, వేపాడ మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. భూరికార్డులను పరిశీలించి భూముల వర్గీకరణపై వివిధ ప్రభుత్వ శాఖల వద్ద రికార్డుల్లో తేడాలు వుండటాన్ని గుర్తించారు. భోగాపురం మండలం పోలిపల్లి నిర్వాసితుల పునరావాస కాలనీని పరిశీలించారు. మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు చేరుకొని గ్రామ రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడి భూముల క్రయవిక్రయాలపై సమాచారం సేకరించారు. అనంతరం భోగాపురంలో తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించి భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బసవపాలెం గ్రామస్థులతో మాట్లాడి భూసర్వే జరిగిన తీరుపై ఆరా తీశారు. ఆయన వెంట కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, జిల్లా రిజిస్ట్రార్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డులను సరిచేస్తాం

క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూముల రికార్డుల్లో కొన్ని తేడాలను గుర్తించామని, వాటిని సరిచేయాలని ఆదేశాలు జారీ చేశామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా చెప్పారు. విజయనగరం జిల్లా పర్యటన సందర్భంగా ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. భూముల రికార్డులను పరిశీలించడానికి, రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి రోజుకో జిల్లా చొప్పున పర్యటిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా భోగాపురం మండలం పోలిపల్లి, బసవపాలెం గ్రామాలను సందర్శించామని, ఎఫ్‌సిఐ, పాత అంగల్, 22ఎ జాబితాలను పరిశీలించామని చెప్పారు. కొన్ని రికార్డుల్లో, భూముల వర్గీకరణలో గుర్తించిన తేడాలను సరిచేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లాలో సుమారు 5,700 ఎకరాలను ఫ్రీహోల్డు చేశారని, దానిలో 191 ఎకరాలు వరకు రిజిస్ట్రేషన్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. నిబంధనల ప్రకారం ఫ్రీ హోల్డు జరిగిందా లేదా?, రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగాయా? లేదా అన్నది కూడా పరిశీలించామని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి ప్రజలనుంచి సుమారు 80 వినతులను స్వీకరించామని, వాటన్నిటినీ పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని సిసోడియా తెలిపారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జెసి ఎస్.సేతు మాధవన్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

శృంగవరపుకోట : ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా తనిఖీ చేశారు. వివిధ రికార్డులను, భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ పి.శ్యామల సంభందిత రికార్డులను చూపించారు. పర్యటనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, జిల్లా రిజిస్ట్రార్ కుమారి, ఆర్‌డిఒఎంవి సూర్యకళ, తాహశీల్దార్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బొత్స సత్యనారాయణ

ఎమ్మెల్సీగా బొత్స

చీపురుపల్లిలో వైసిపి సంబరాలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

వైసిపి సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ.. విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. దీంతో శుక్రవారం సాయంత్రం చీపురుపల్లి మండలంలో వైసిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో విశాఖపట్నం నుంచి బొత్స సత్యనారాయణ వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో ఆయన ఒక్కరే బరిలో నిలవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికలాధికారులు ప్రకటించారు. దీంతో చీపురుపల్లి మండల కేంద్రంలో వైసిపి నాయకులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, రామలింగాపురం సొసైటి మాజీ అధ్యక్షులు రేవల్ల సత్యనారాయణ, అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాథరావు, వంగపల్లిపేట ఎంపిటిసి గెరిడి రామదాసు, ఇతర వైసిపి నాయకులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాణసంచా కాలుస్తున్న వైసిపి శ్రేణులు

ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న జూడాలు

అత్యాచార నిందితులను

కఠినంగా శిక్షించాలి

- రక్షణ కల్పించాలని జూడాల ఆందోళన
- నగరంలో రాస్తారోకో, ఎస్ఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కోల్‌కతాలో ఐదు రోజుల క్రితం వైద్యారాలిపై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, పీజీ విద్యార్థిని మౌనిత దెబ్నత్‌కు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడ రాస్తారోకో చేపట్టారు. జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలని, మౌనిత దెబ్నత్ కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, మెడికల్ విద్యార్థులు హేమంత్ రెడ్డి, స్నేహిత, విశాల్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఆఖరికి ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు ఆసుపత్రిలో రక్షణ లేకుండా పోతోందన్నారు. విధుల్లో ఉన్న డాక్టర్లే అత్యాచారానికి గురవుతుంటే దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతుందని అన్నారు. ఇదేనా స్వాతంత్ర్యం అని ప్రశ్నించారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు మాట్లాడుతూ పోస్టుమార్టం రిపోర్టును బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల విద్యార్థులు జస్వంత్ , అరుణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. వెంకీ. జిల్లా సహాయ కార్యదర్శి సమీరా, రమేష్, రూప ,సోమేశ్ ,రాజు ,రాహుల్, మురళి, గుణ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జూడాలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు

ప్రజాసంఘాల ఆధ్వర్యాన మానవహారం

వైద్యురాలు హత్య కేసులో నిందితులకు కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం రాత్రి జూడోలు నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, సిఐటియు నగర కాయదర్శి ఎ.జగన్మోహన్, జెవివి సమతా నాయకులు జి.నిర్మల, ఐద్వా నాయకులు వి.లక్ష్మి, శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.సుధారాణి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

జూనియర్ డాక్టర్ పై హత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, పట్టణపౌర సంక్షేమసంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. వైద్యుల ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు.

మహేష్ (ఫైల్) ఉపాధ్యాయులు గల్లంతైన వాగు ఇదే.. ఆర్తి (ఫైల్)

ఇద్దరు ఉపాధ్యాయులను

మింగేసిన గెడ్డవాగు

ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు

ప్రజాశక్తి-పాచిపెంట

అకస్మాతుగా కురిసిన వర్షానికి పొంగి ప్రవహించిన గెడ్డవాగు ఇద్దరు ఉపాధ్యాయులను బలితీసుకుంది. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఇద్దరు ఏక లవ్య పాఠశాల ఉపాధ్యాయులు గెడ్డ ఉధృతికి కొట్టుకుపోయారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యం కాగా, మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పాచిపెంట మండలం సరాయివలస రాయిమానుగెడ్డ వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

పాచిపెంట మండలం సరాయివలస సమీపంలోని కొటికిపెంట ఏక లవ్య పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇద్దరు కొండవాగు గెడ్డ (రాయిమానుగెడ్డ)లో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. వారిలో మహిళా ఉపాధ్యాయరాలి మృతదేహం లభ్యమైంది. హర్యానా రాష్ట్రానికి చెందిన పి.ఆర్తి(26), డిప్యూటీ వార్డెన్ మహేష్ (31) ఈఏడాది జూన్ 20న ఇక్కడ ఉపాధ్యాయులుగా చేరారు. ఆర్తి (పిజిటి) జాగ్రఫీ టీచర్‌గా, మహేష్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో వసతి సౌకర్యం లేకపోవడంతో పాచిపెంట మండలం గురువునాయుడుపేటలో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకొని పాఠశాల నుంచి గురువునాయుడుపేటకు బైక్‌పై బయలు దేరారు. మధ్యాహ్నం కురిసిన వర్షానికి కొండవాగు ఉధృతంగా ప్రవహించడంతో కొద్దిసేపు గెడ్డవద్ద ఆగారు. అదే సమయంలో మరో వాహనం గెడ్డ దాటుకుని వెళ్లిపోవడంతో వీరు కూడా మోటార్ సైకిల్‌తో గెడ్డ దాటేందుకు ప్రయత్నించగా అకస్మాత్తుగా గెడ్డ ఉధృతం కావడంతో ఇరువురూ కొట్టుకుపోయారు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక తాహశీల్దార్ డి.రవి, ఆర్ ఐ రమణ, ఎస్ఐ పి.నారాయణరావు, సిబ్బంది హుటాహుటిన ఇక్కడికి చేరుకొని గాలింపు చేపట్టారు. వారు ప్రయాణించిన బైక్ అరకిలోమీటరు దూరంలో ఇసుకలో కూరుకుపోయి కనిపించగా, అక్కడికి మరికొద్ది దూరంలో ఆర్తి మృతదేహం లభించింది. వార్డెన్ మహేష్ కోసం గాలించినప్పటికీ లభ్యం కాలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేస్తున్నట్లు తహశీల్దార్ రవి తెలిపారు. ఆర్తి మృతదేహాన్ని సాలూరు సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బొబ్బిలిలో భారీ వర్షం

రోడ్లన్నీ జలమయం

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్డుపై గోతిలో దిగబడిన ఆటోను నెడుతున్న జనం

బొబ్బిలిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో రహదారులు జలమయమయ్యాయి. పూల్‌బాగ్ రోడ్డు, పాతబొబ్బిలి రోడ్డు, బజారు రోడ్డు జలమయం అయ్యాయి. రోడ్లపై వరదనీరు పొంగిపొర్లడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూల్‌బాగ్ రోడ్డు చెరువును తలపించింది. రోడ్డుపై గోతుల్లో వరదనీరు చేరడంతో వాహనదారులు గోతుల్లో పడిపోయారు. దీంతో పూల్‌బాగ్ రోడ్డుపై రాకపోకలు చేసేందుకు వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పూల్‌బాగ్ రోడ్డును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్వల శ్రీనివాసరావు పరిశీలించారు. రోడ్లు బాగు చేసి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

- నిర్వహణలో ప్రజలు భాగస్వాములు కావాలి
- మంత్రి శ్రీనివాస్ పిలుపు
- మాజీ కేంద్ర మంత్రి అశోక్, ఎంపి, ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభం

ఆహారం వడ్డిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, చిత్రంలో ఎంపి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలకు, కార్మికులకు, విద్యార్థులకు అన్న క్యాంటీన్ల వల్ల ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రోజువారీ పనులు చేసుకొనే కార్మికులు, విద్యార్థులు, నిరుపేదలు ఈ క్యాంటీన్లలో తక్కువ ఖర్చుతో కేవలం రూ.5 కే రుచికరమైన భోజనం, టిఫిన్ పొందే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. శ్రీగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్, మున్సిపల్ మార్కెట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రెండు అన్న క్యాంటీన్లను మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు,ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మితో కలసి శుక్రవారం మంత్రి కొండపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అన్న క్యాంటీన్‌లో పలువురికి టిఫిన్ వడ్డించారు. అనంతరం వారంతా అక్కడే టిఫిన్ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఈ క్యాంటీన్ల ద్వారా గతంలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. బొబ్బిలిలోనూ మరో క్యాంటీన్ నేటి నుంచి ప్రారంభిస్తున్నామని చెప్పారు. అన్న క్యాంటీన్లను స్వయం సమృద్ధి కావాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే ప్రజల నుంచి విరాళాలు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు.

నెల జీతం విరాళంగా ప్రకటించిన మంత్రి

అన్న క్యాంటీన్ల నిర్వహణకు తన నెల జీతం విరాళంగా ఇస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. తన నాన్నమ్మ స్మారకంగా ఈ విరాళాన్ని ఇస్తున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ కు అందించనున్నట్టు పేర్కొన్నారు. అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల తరహాలో పేదలకు, విద్యార్థులు, అసహాయులకు అన్నంపెట్టే సంస్కృతి విజయనగరం జిల్లాలో ఏనాటి నుంచో వుందని అన్నారు. అందరూ సహకరిస్తేనే అన్న క్యాంటీన్ల వ్యవస్థ భవిష్యత్తులో నిరాటంకంగా నడుస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో విరాళాలను అందించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు రూ.6 లక్షలు ప్రజల నుంచి విరాళాల రూపంలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు అందించామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎంఎం నాయుడు, మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ విరాళాల కోసం బ్యాంకు ఖాతా ఏర్పాటు

అన్న క్యాంటీన్‌ల నిర్వహణకు విరాళాలు ఇచ్చే వారికోసం ప్రభుత్వం ఒక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసిందనికలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. గుంటూరు చంద్రమౌళి నగర్ భారతీయ స్టేట్‌బ్యాంకు బ్రాంచిలో గల 37818165097 నెంబరుతో గల బ్యాంకు ఖాతాకు ప్రజలు తమ విరాళాలు జమచేయవచ్చన్నారు. ఈ బ్యాంకు బ్రాంచి ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ SBIN0020541 గా వుందని పేర్కొన్నారు.

రాక్రీట్ గృహ నిర్మాణాలపై విజిలెన్స్ దర్యాప్తు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం రూరల్ మండలం గుంకలాం, కొండకరకాం గ్రామాల్లో జగనన్న హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా రాక్రీట్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన గృహ నిర్మాణంపై దర్యాప్తు చేస్తున్నామని శ్రీకాకుళంలోని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్.పి. ఏ సురేష్ బాబు తెలిపారు. తమ విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు ఇప్పటికే చేస్తున్నారని, క్షేత్ర స్థాయిలో తనిఖీలు, రికార్డుల పరిశీలన పూర్తయిన తర్వాత ఇందులో లోపాలు కనుగొంటామని పేర్కొన్నారు. ఈ సంస్థకు గుంకలాంలో 5097, కొండకొరకాం లో 958 కలసి మొత్తం 6055 ఇళ్లు కేటాయించగా ఇప్పటి వరకూ ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేయలేదని పేర్కొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ అంతర జిల్లాల తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, కార్యదర్శి సిహెచ్ వేణు గోపాలరావు తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఇందులో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. పోటీలను విజయవంతం చేసేందుకు క్రీడాకారులు,క్రీడాభిమానులు సహకరించాలని కోరారు.

కాలువల అధ్వానంపై మంత్రి ఆగ్రహం

వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కార్యాలయం జంక్షన్‌లో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం ప్రక్కనే ఉన్న మార్కెట్ ప్రాంతంలో గల అధ్వానంగా ఉన్న కాలువను రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పరిశీలించారు. కాలువ పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో నిండిపోయి మురుగు నీరు పోయేందుకు వీలు లేని పరిస్థితిని పరిశీలించారు. ఎందుకు కాలువ ఈ స్థితిలో ఉందని కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, శరవేగంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా కు అంతరాయం

ఈనెల 17న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నగరంలో తోటపాలెం 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోగల నాయుడు కాలనీ ఫీడర్‌పై చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.హరి తెలిపారు. నర్సింహనగర్, సిద్ధార్థనగర్, తోటపాలెం, నాయుడు కాలనీ, గాయత్రీ కాలేజి, కల్యాణ్‌నగర్, తదితరప్రాంతాలకు విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు.

గిరిజన విద్యార్థులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సికి దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన విజయనగరం జిల్లాకు చెందిన వంద మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ సాధికారిత అధికారి బి. రామానందం తెలిపారు..శిక్షణ కాలం 2 నుండి 3 నెలలు ఉంటుందని, ఈనెల నాలుగో వారంలో ప్రారంభమవుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన సౌకర్యం, వసతి కల్పిస్తామని తెలిపారు. బిఇడి, డిఇడి, టెట్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇంటర్, డిఇడి, డిగ్రీ, బిఇడి, టెట్‌లో మార్కులు ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 23 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను సంబంధిత విద్యార్హత పత్రలు, కుల ధ్రువీకరణ, రేషన్‌కార్డు నకలు, 2పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలుకు కె.నాగరాజు (83748 21431) అనూష (82478 52338) నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

జిఆర్‌పిఎస్ ఎస్ఐగా బాలాజీరావు

ప్రజాశక్తి-గజపతినగరం

విజయనగరం జిఆర్‌పిఎస్ ఎస్ఐగా బాలాజీరావు నియమితులయ్యారు. విశాఖపట్నం నుంచి ఆయన బదిలీపై విజయనగరం జిఆర్‌పి స్టేషన్‌కు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిఆర్‌పి స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రేపు అండర్ 13 ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ఆదివారం స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో జరుగుందని ఫుట్‌బాల్ అసోషియేషన్ సహాయ కార్యదర్శి ఎ.రామచంద్రరావు, కోచ్‌రాము ఒక ప్రకటనలో తెలిపారు. 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31 లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రాలతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విజయనగరంలో రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో జరగనున్న ఎంపిక పోటీలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8247543001 నెంబరును సంప్రదించాలని కోరారు.

ధ్వంసమైన విద్యుత్తు పరికరాలు

ఏనుగుల దాడిలో విద్యుత్తు పరికరాలు ధ్వంసం

ప్రజాశక్తి- వంగర

ఏనుగుల దాడిలో విద్యుత్తు పరికరాలు ధ్వంసం అయ్యాయని మండలంలోని పెదరాజుల గుమ్మడ గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. ఈనెల 11న వివిఆర్ పేట పొలాలలోకి ప్రవేశించిన గజరాజులు ఈ గ్రామానికి సమీపంలో ఉన్న పెదరాజుల గుమ్మడ గ్రామానికి చెందిన ఆలుబిల్లి వెంకట నాయుడుకు చెందిన విద్యుత్తు మోటార్ పరికరాలను, పామాయిల్ మొక్కలను శుక్రవారం ధ్వంసం చేశాయి. వావిలపల్లి వంశీకి చెందిన చెరకు యమక వెంకటరమణ, ఆలు బెల్లి వసంతరావు తదితర రైతులకు చెందిన పంటలను ధ్వంసం చేశాయి. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని గజరాజులను అటవీ ప్రాంతంలోకి తరలించాలని కోరుతున్నారు.

విజయలక్ష్మికి అవార్డు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయలక్ష్మి

స్థానిక సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్) సంస్థ డైరెక్టర్ వై.విజయలక్ష్మికి ఉత్తమ అవార్డు దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ జి.శశిభూషణరావు విశ్వవిద్యాలయ స్థాయి ఉత్తమ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారిగా ఆమెకు అవార్డును బహూకరించారు. ఆమె ప్రస్తుతం అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా, ఎన్ఎస్ఎస్ పిఒగా విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్ వేలూరి సీతారత్నం, జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, సిమ్ కో కన్వీనర్ వి.నాగేశ్వరరావు ఆమెను అభినందించారు.

సమస్యలపై కార్మికుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సమస్యల పరిష్కారం కోసం డిపో కార్మికులు ఎన్ఎంయు ఆధ్వర్యాన శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. డిపో మేనేజర్‌తో చర్చలు జరిగినా ఫలితం లేకపోవడంతో ఈ నిరసన తెలిపినట్లు ఎన్ఎంయు డిపో కార్యదర్శి ఎ.రాజయ్య తెలిపారు. శనివారం కూడా నిరసన తెలపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎంయు జిల్లా కార్యదర్శులు బిఎస్ రాములు, చంద్రమౌళి, డిపో నాయకులు జివి రమణ, కార్మికులు పాల్గొన్నారు.

డెంకాడ ఎస్ఐగా సన్యాసినాయుడు

ప్రజాశక్తి-డెంకాడ

ఎస్ఐ సన్యాసినాయుడు

డెంకాడ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎ.సన్యాసినాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎం.కృష్ణమూర్తి బదిలీపై విజయనగరం వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రజలతో మమేకమై శాంతిభద్రతల విషయంలో ఎలాంటి వివక్షతకు తావు లేకుండా విధులు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టనంలో శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ రవి తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ చెట్లు కొడుతున్నట్లు తెలిపారు. అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ఎపిజిఇఎ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ట్రెజరీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిజిఇఎ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ నెల్లిమర్ల తాలూకా అధ్యక్షులు పి.వి.దొర, అసోసియేట్ అధ్యక్షులు జి.చక్రవర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.వెంకటరావు, ఉపాధ్యక్షులు జె.వి.లీల, జాయింట్ సెక్రటరీ కృష్ణవేణి, సెక్రటరీ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-డెంకాడ

బదిలీపై వెళ్తున్న ఎంపిడిఒ లవరాజును స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం సన్మానించారు. ఎన్నికల సమయంలో విశాఖ జిల్లా ఆనందపురం మండలం నుంచి ఇక్కడికి వచ్చిన లవరాజు మళ్లీ అదే మండలానికి బదిలీపై వెళ్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పతివాడ అప్పలనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ప్రజాశక్తి-బాడంగి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన మండలంలోని పాల్తేరు వాటర్ ట్యాంకు జంక్షన్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. తెర్లాం మండలం పాములవలస గ్రామానికి చెందిన అనిల్ బైక్‌పై ఆకులకట్ట వైపు నుంచి వస్తుండగా, కోడూరు గ్రామానికి చెందిన రౌతు సత్యనారాయణ ఎదురుగా వస్తుండగా ఢీకొన్నారు. సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ఆయన్ను బాడంగి సిహెచ్‌సికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి, రైల్వే జంక్షన్ రిషి కళాశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. గొల్లపల్లి గ్రామానికి చెందిన గేదెల పైడయ్య వర్ధంతి సందర్భంగా ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్యులతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని బేబినాయన అన్నారు. రిషి కళాశాలలో క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సమితి, బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్, బొబ్బిలి డివిజనల్ పాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని బేబినాయన సందర్శించారు. రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బేబినాయన

గంజాయి కేసుల్లో నిందితులపై సస్పెక్ట్ షీటు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

బొబ్బిలి పట్టణంలోని ఆర్‌సిఎం స్కూలు వెనుక గల బరియల్ గ్రౌండులో కొంతమంది వ్యక్తులు వద్ద గంజాయి ఉన్నట్లు వచ్చిన సమాచారంతో బొబ్బిలి సిఐ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రైడ్ చేసి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 16కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వకుల్‌జిందాల్ వెల్లడించారు.

గంజాయి అక్రమ రవాణ, అమ్మకాలు, వినియోగం చేపడుతున్న వారిపై పోలీసులు విస్తతంగా దాడులు చేసి, నిందితులను అరెస్టు చేసి, వారికి గంజాయిని ఎవరు సరఫరా చేస్తున్నది. ఎక్కడ నుండి కొనుగోలు చేస్తున్నది, ఎలా లభ్యమవుతున్నదనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో గంజాయి విక్రయించే వారిని, చిన్న మొత్తంలో విక్రయించే పెడ్లర్స్‌ను గుర్తించి, పట్టుబడిన నిందితుల నుండి సమాచారాన్ని రాబడుతున్నామన్నారు. బొబ్బిలి పట్టణంలోని ఆర్‌సిఎం. స్కూలు వెనుక భాగంలోగల బరియల్ గ్రౌండు వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న 8మంది పోలీసులను చూసి, పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని అదుపులోకి తీసుకొని, 16కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా నాగలాపురానికి చెందిన నాగలాపురం లోహిత్ భరత్ (25).. బొబ్బిలికి చెందిన చింతాడ సారథి (40) వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో లోహిత్ నుండి ఆరు కిలోలు, సారథి వద్ద నాలుగు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బొబ్బిలికి చెందిన సిమిడి ప్రేమ్ కుమార్ (18), లంక నిఖిల్ (26), దేవుపల్లి చందన్ (19) ఒడిస్సాలోని వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి, తీసుకొని వచ్చి చింతాడ సారథి అలియాస్ నానికి అందజేసి, గంజాయి వ్యాపారంలో సహాయపడే వారని ఎస్‌పి తెలిపారు. వీరితోపాటు ముగ్గురు జువినల్స్ కూడా అక్రమంగా గంజాయి తరలించడంలో సహకరించే వారని, వారిని కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన మిగిలిన నిందితుల వద్ద నుండి మరో ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లోహిత్ భరత్ పై ఇప్పటికే పార్వతీపురం పట్టణం పిఎస్ లో గంజాయి కేసు నమోదైందన్నారు. ఇంకా ఈ కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులు గురించి ఆరా తీసి, వారిని కూడా నిందితులుగా చేర్చుతామని చెప్పారు. గంజాయి కేసుల్లో అరెస్టయిన నిందితులపై సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని, వారిపై నిఘా ఉంచుతామని, ఇదే తరహా నేరాలకు తరుచూ పాల్పడితే నిందితులపై పీడీ యాక్ట్ కూడా పెడతామని తెలిపారు. ఇటీవల విజయనగరంలో నమోదైన గంజాయి కేసుల్లో కూడా లింకులను చేధించి, నిందితులను అరెస్టు చేసామని తెలిపారు. సమావేశంలో బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్చార్జ్ సిఐ ఎం. నాగేశ్వరరావు, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఇ. నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

నాలుగు కేజీల గంజాయి పట్టివేత

విజయనగరం కోట : నగరంలోని రైల్వే స్టేషన్ నుంచి సిఎంఆర్ షాపింగ్ మాల్‌కు వెళ్లే మధ్యలో అనుమానాస్పద తిరుగుతున్న వ్యక్తిని వన్‌టౌన్ ఎస్ఐ నవీన్‌పడాల్ పట్టుకొని అతడి నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్టేషన్‌లో సిఐ ఎస్.శ్రీనివాస్ నిందితుడు గోవర్ధన్ పటేల్‌ను హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. ఒడిశా రాష్ట్రం సబన్పూర్ జిల్లా లోని దిగ్సిర అనే గ్రామం నుంచి వచ్చాడని, తనకు పరిచయం ఉన్న బాలంగిర్‌కు చెందిన మనోజ్ ద్వారా విజయనగరం వచ్చినట్లు నిందితుడు చెప్పాడని సిఐ వివరించారు. గంజాయిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

రామభద్రపురం : మండల పరిధిలో కొట్టక్కి జంక్షన్ వద్ద చేపట్టిన తనిఖీల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. సాధారణ వాహన తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఒడిశాకు చెందిన హర ప్రసాద్ హన్నాను తనిఖీ చేశారు. వాహన డిక్కీలో సుమారు 20 కిలోల గంజాయి దొరికినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన్ను విచారించగా ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా సుంకి నుంచి ఈ గంజాయి తరలిస్తున్నట్లు తెలిపాడు. గంజాయి తరలింపునకు మల్కాజిగిరి జిల్లా గురుసేతు గ్రామానికి చెందిన జినుపంగి, పాతిసిగోయి సహకారం ఉందని విచారణలో తేలింది. ముగ్గురిపై కేసు నమోదు చేసి సరుకును సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు. మిగతా ఇద్దరినీ అరెస్టు చేస్తామన్నారు. సీజ్ చేసిన గంజాయి ఖరీదు సుమారు రూ.లక్ష వరకు ఉంటుందన్నారు.

వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు

నిందితురాలు అరెస్టు

విజయనగరం కోట : బాడంగి మండలం ముగడ కాలనీలో ఈనెల 11న వృద్ధురాలిని హత్య చేసి ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన నిందితురాలు కలిశెట్టి లలిత కుమారి (25) అరెస్టు చేసి, ఆమె దోచుకున్న 14.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని, రిమాండుకు తరలించినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ముగడ కాలనీలో నివాసం ఉంటున్న గెద్ద కృష్ణవేణి (62) భర్త నారాయణప్పల నాయుడు హెడ్ మాష్టారుగా పనిచేసి 2018లో చనిపోయారు. ఈ నెల 11వ తేది రాత్రి ఆమె హత్యకు గురైంది. కృష్ణవేణి ఇంటికి ఎదురుగా కొంతకాలంగా కలిశెట్టి లలిత కుమారి నివాసం ఉంటూ, 20 రోజులు క్రితం ఇల్లు ఖాళీ చేసి విశాఖలో కంచరపాలెం వెళ్ళిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఈనెల 11న ముగడ కాలనీకి వచ్చి, ఒంటరిగా నివాసం ఉంటున్న కృష్ణవేణిని హత్య చేసి ఆమె శరీరంపై ఉన్నటువంటి 14.5 తులాల బంగారు ఆభరణాలు దోచుకొని వెళ్లిపోయినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించారు. బొబ్బిలి డిఎస్‌పి పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బొబ్బిలి సిఐ ఎం.నాగేశ్వరరావు, సిసిఎస్ సిఐ ఎ.సత్యన్నారాయణ సిబ్బంది బృందాలుగా ఏర్పడి, నిందితురాలిని పట్టుకొనేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితురాలు కలిశెట్టి లలిత కుమారి ని బొబ్బిలి ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద అరెస్టు చేసి, విచారించారు. కృష్ణవేణిని చున్నీతో గొంతు బిగించి, హత్య చేసి, ఆమె ఒంటిపైగల బంగారు ఆభరణాలు దోచుకొని వరారైనట్లుగా నేరం అంగీకరించినట్లు ఎస్‌పి తెలిపారు. నాలుగు రోజుల వ్యవధిలోనే హత్య కేసును చేధించిన డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ ఎం.నాగేశ్వరరావు, సిసిఎస్ సిఐ ఎ.సత్యనారాయణ, బాడంగి ఎస్ఐ ఆర్. జయంతి, సిసిఎస్ ఎస్ఐ భాగ్యం, ఎఎస్ఐలు డి.కొండలరావు, ఎ.గౌరీ శంకర్, కానిస్టేబుళ్లను ఎస్‌పి అభినందించారు.

రైతుల భూ సమస్యలను పరిష్కరించాలి

రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో రైతులు తమ భూముల హక్కు పత్రాలు, గ్రామాల్లో రెవెన్యూ పరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియాకు ఎపి రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సిసోడియాను రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు లోకవరపు ఆదినారాయణమూర్తి కలిసి వినతి అందజేశారు. భూ రికార్డులు డిజిటలైజ్ చేసిన సందర్భంగా వెబ్‌ల్యాండ్ నమోదులో జరిగిన పొరపాట్లు, తహశీల్దార్ కార్యాలయాల్లో మ్యుటేషన్ కోసం సన్న, చిన్న కార రైతులు దరఖాస్తు పెట్టుకుంటున్న సందర్భంగా కిందిస్థాయి కొంత మంది రెవెన్యూ సిబ్బంది అలసత్వం, అవినీతి వల్ల ముటేషన్ అప్లికేషన్ రిజెక్ట్ చేస్తున్నారని తెలిపారు. సమగ్ర భూ సర్వే వల్ల భూహక్కు పత్రాలు వస్తాయని ఆశిస్తున్న రైతులకు పత్రాలు అసమగ్రంగా అనేక లోపాలతో రావటం వల్ల మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. వీటన్నింటినీ పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో భూరికార్డులు డిజిటలైజ్ చేసిన సందర్భంగా అనేక మంది భూహక్కుదారుల ఆధార్ లింక్ కాకున్న వేరే వ్యక్తి పేర ప్రభుత్వ భూమిగా, తదితర వెబ్‌ల్యాండ్ నమోదులో తప్పువల్ల భూవివాదాలు వస్తున్నాయని తెలిపారు. భూముల వారసుల పేరు మార్పుకు పెట్టుకున్న దరఖాస్తులను పరిష్కరించడం లేదని తెలిపారు. గ్రామ పురోణీ, ఆడపిల్లలకు పసుపు కుంకుమ కింద ఇచ్చిన, కుటుంబ సభ్యులలో మారకం, భూమి పొజీషన్, వివాదము లేనివి నమోదు చేసే దానికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ క్రాప్ నమోదులో పొరపాట్లను సరిచేయాలని కోరారు.

సిసోడియాకు రైతు సంఘం వినతి

సమస్యలపై ఫిర్యాదు

భోగాపురం : మండలంలోని వివిధ సమస్యలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి సిసోడియాకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని 98 ఎకరాలను ఓ వ్యక్తి తనదని ఫిర్యాదు చేయడంతో ఆర్‌డిఒ సూర్యకళ ఆ భూములను ఎటువంటి లావాదేవీలు జరగకుండా రెడ్‌మార్కులో పెట్టేశారని సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీలో అక్రమాలు కూడా జరిగాయని తెలిపారు. సర్వే నెంబర్ 185లోడి-పట్టా భూములు భారీ ఎత్తున చేతులు మారాయని, దీనిపై విచారణ చేయాలని ఆయన కోరారు. విమానాశ్రయ భూసేకరణలో చాలామంది రైతులకు గత ప్రభుత్వం హయాంలో అన్యాయం జరిగిందని వివరించారు. పరిహారంతోపాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కేటాయింపుల్లోనూ చాలా అన్యాయం చేశారని వివరించారు. దీనిపై విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని వీరు కోరారు.

ఇ-ఆటోను నడుపుతున్న మంత్రి శ్రీనివాస్

పరిశోధనల వైపు దృష్టిసారించాలి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

యువత పరిశోధనల వైపు దృష్టిసారించాలని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఐఒటి ద్వారా అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ కుట్టు యంత్రాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తక్కువ ఎత్తులో ఎగిరే జైరో ప్లేన్, ఎలక్ట్రిక్ బ్యాటరీతో నడిచే ఇ-ఆటోలు, సేంద్రీయ ఎరువులతో తయారు చేసిన ఆహార పదార్థాలు, 3డి యంత్రం, ఆగ్యుమెంటెడ్ రియాల్టీ వర్చువల్ రియాల్టీ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ యువత నైపుణ్యాలు నేర్చుకోవడానికి అవసరమైన సౌకర్యాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో కలిసి పనిచేద్దామని చెప్పారు. అమరావతిలో ప్రభుత్వం నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందన్నారు. దానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు.. విశ్వవిద్యాలయం లక్ష్యాల గురించి మంత్రికి వివరించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహంతి విశ్వవిద్యాలయం ప్రగతికి సంబంధించి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. గ్రామ్ తరంగ్ సిఇఒ బాబు శంకర్, వెంకట్.. డ్రోన్ల ద్వారా రైతులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారో వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ ప్రొఫెసర్ మురళీ, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఎన్‌సిసి అధికారి డాక్టర్ సతీష్, యాజమాన్య ప్రతినిధి ఎస్.రవీంద్ర పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం డిఎస్‌పి గోవిందరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం స్టేషన్ మేడపై ఉన్న సిఐ కార్యాలయం, పట్టుబడ్డ గంజాయి, గుట్కా, వివిధ వస్తువులతోపాటు స్టేషన్లో అన్ని రికార్డులను ఆయన పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిఐ నారాయణమూర్తి, ఎస్ఐ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎస్‌పి గోవిందరావు

సమావేశంలో సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

విద్యాప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. లక్కవరపుకోట మండలంలో నిర్వహించిన వసతిగృహాల సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు ముందుండే విధంగా అధికారులు తగిన శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సమావేశంలో కొత్తవలస ఎంపిడిఒ, రెవెన్యూ సిబ్బంది, ఎల్.కోట మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, టిడిపి ఎస్.కోట మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, ఖాసాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, మాజీ ఎంపిటిసిలు కొట్యాడ రాముడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో హ్యుందాయ్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-బొబ్బిలి

పూజలు చేస్తున్న లక్ష్మి గ్రూప్ సిఇఒ శ్రీనివాస్, మేనేజర్లు

బొబ్బిలి పట్టణంలో లక్ష్మి హ్యుందాయ్ షోరూంను శుక్రవారం ప్రారంభించారు. బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, రామభద్రపురం, బలిజిపేట ప్రాంతాల కస్టమర్లకు హ్యుందాయ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని లక్ష్మి గ్రూప్ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్ తెలిపారు. మొబైల్ సర్వీసు అందుబాటులో ఉంటుందని, టెస్ట్ డ్రైవ్ కోసం 8096666550 నంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ జిఎం జి.కిశోర్‌కుమార్, బ్రాంచి మేనేజర్లు వెంకట్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసిరెడ్డి కృష్ణమూర్తి జయంతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీమంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ జంక్షన్లో ఉన్న వాసిరెడ్డి విగ్రహానికి కొప్పల వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ జి.కృష్ణమూర్తి, అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు మంత్రిగా పని చేసి బొబ్బిలి ప్రాంత అభివృద్ధికి పని చేశారని వారు కొనియాడారు. రైతులకు సాగునీరు అందించేందుకు వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు, ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం, డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం నాయకులు సాయికృష్ణ, ఆర్.కృష్ణమూర్తి, ఆర్.దామోదర్, శివ, పి.స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి విగ్రహానికి పూలమాల వేస్తున్న జి.కృష్ణమూర్తి, సత్యనారాయణ

BOBBILI MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

Roc.No.74/2023/E1. Dt.16-08-2024

S.No.	Nit No.	No. of works	Estimated cost
1	06/2024-25/DyEE/1-6, dt.16.08.2024	6	Rs. 21.35 Lakhs

Bid Document Downloading Start Date : 17.08.2024 at 11.00 AM
Bid Document Downloading End Date : 24.08.2024 at 11.00 AM
Last Date & Time for receipt of Bids : 24.08.2024 at 3.00 PM
Technical Bid opening Date : 24.08.2024 at 4.00 PM

Note: Other details please read e.procurement market plan https: tender apeprocurement.gov.in

Commissioner,
Bobbili Municipality

IN THE COURT OF THE HON'BLE XXV ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT, AT HYD'BAD. O.P.NO. 1843 of 2015

Between:-
K. Vasundara Devi ...Petitioner
AND
K. Gouri Naidu && others ... Respondents.

NOTICE

To
R7 T. Hemasundra Rao S/o.not known, age: Major, Occ:Owner of Car. B. No. AP31AB 8625, R/o.D. No.1-19-808, B.C. colony, Vizianagaram, A.P.

I submit that above said case is filed against you and other respondents claiming compensation for the death of petitioner husband in the motor accident for claiming compensation. The matter is posted on 30-08-2024 for your appearance at about 10.30 a.m. before the above said court without failure in person or with Advocate or else matter will be decided on merits.

Sd/-
U. Praveen Aumar
M. Dhanuja
Advocates
0/o. Room No.4A, Twin City Complex, M.J. Road, nyderabad
Ph:9394834693.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE CUM EXCISE MAGISTRATE COURT AT VIZIANAGARAM
I. A.249/2020 O.S. 411/2019

Between:
Sanapathi Satyavathi ...Petitioner/Plaintiff
And:
Pandranki Sanyasappadu (died) and others ...Respondents/Defendants

Respondents/Defendants:

2. Pandranki Appayyamma W/o late Snyasappadu, Hindu, aged 60 years, residing at Karrothu Veedhi, Kella village, Gurla mandal, Vizianagaram dist. (1st wife of the deceased)
3. Pandranki Srinu S/o late Sanyasappadu, Hindu, aged 40 years, rest do (1st wife 1st son)
4. Pandranki Gophi S/o late Sanyasappadu, Hindu, aged 25 years, rest do. (1st wife 2nd son)
5. Pandranki Ramu S/o late Sanyasappadu, Hindu, aged 25 years, rest do. (1st wife 3rd son)
6. Pandranki Sarada D/o late Sanyasappadu, Hindu, aged 38 years, rest do. (1st wife daughter)

పై నెంబర్ I.A./దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం పై కోర్ట్ వారు పలుమార్లు మీకు కోర్ట్ ద్వారాను మరియు రిజిస్ట్రార్ పోస్ట్ ద్వారాను కోర్ట్‌కి హాజరు కమ్మని సమన్స్ జారీ చేసినారు. అయినప్పటికి మీరు వాటిని ఉద్దేశ పుర్వకముగాను తీసుకొనలేదు, మరియు కోర్ట్‌కి హాజరు కాలేదు. అందుకు మీ హాజరు నిమిత్తము తేది: 30-08-2024 దిన పైన తెలిపిన కోర్ట్ లో హాజరు కొరకు అదేశియించు ఉన్నారు. కావున మీరు **తేది: 30-08-2024దిన ఉదయం గం: 10-30 నిమిషాలు**కు మీరు గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలసినదిగా ఈ ప్రకటన మూలకముగా తెలుయుజేయుచున్నం అట్లు మీరు కోర్ట్ కి హాజరు కాని పక్షంలో మీ పై పరోక్షముగా శ్రీ కోర్ట్ వారు చర్య తీలుకుందురు అని తెలుయుజేయుడం ఆయనిది.

A. HARISH
R. RAMAKRISHNA
ADVOCATES
Opp: OLD Dist CourtComplex, Vizianagaram
Ph: 9494333319, 9490682844